


మూలం :
జయశంకర్ ప్రసాద్
అనువాదం :
పద్మజా భూషణ్

## 1

"ఖైదీ !"

"ఏమిటి ? నిద్రపోనీ —"

"చెరవిడిపించుకోవాలనుకుంటున్నావా ?"

"ఇప్పుడు కాదులే. నిద్ర లేచింతర్వాత. మాట్లాడక పడుకో."

"ఇంత మంచి సమయం ఇక దొరకదు."

"అబ్బ ! చాలా చలిగా వుంది. ఎవరైనా ఒక కంబళీ తెచ్చి కప్పితే బావుండును."

"తుపాను వచ్చేటట్లుగా వుంది. ఇదే సమయం ... ఈ క్షణం నుంచి నేను మాత్రం బందీని కాదు."

"అయితే అసలు నువ్వుకూడా ఖైదీ వేనా యేం ?"

"ఉస్ ... అవును ... నెమ్మదిగా మాట్లాడు. ఈ పడవమీద పదిమంది నావికులు, ఒక కాపలావాడు వున్నారు."

"ఆయుధాలు ఏమైనా దొరుకుతాయా ?"

"ఆఁ ! ఈ పడవను ఆ నావకు కట్టిన తాడు కోయగలవా ?"

"ఆఁ !"

సముద్రంలో అలలు ఉవ్వెత్తుగా లేచిపడుతున్నాయి. ఖైదీలిద్దరూ విముక్తులవడానికి పెనుగులాడుతున్నారు. మొదటి ఖైదీ విడిపించుకొని రెండవ ఖైదీని విడిపించడానికి పెనుగులాడుతున్నాడు. ఆ ప్రయత్నంలో — ఆ అలల తాకిడికి పడవ కదలగా — ఒకరి కొకరు దగ్గరగా వచ్చారు.

పులకింప చేసే స్పర్శ!

విముక్తికోసం ఆకాంక్ష !


అనూహ్యమైన స్నేహాలింగనము !

ఇద్దరూ ఆ చీకటిలోనే విముక్తులయ్యారు.

మొదటిఖైదీ రెండవ ఖైదీని కౌగలించుకున్నాడు.

"ఏమిటి ? నువ్వు స్త్రీవా ?" అన్నాడు ఆ బందీ చకితుడై.

"స్త్రీ అయితే పాపమా ఏం ?" అతనికి దూరంగా జరిగి అన్నది యువతి.





"ఆయుధాలు ఎక్కడ వున్నయ్? నీ పేరేమిటి?"

''చంప"

తళుకుతళుకు మనే తారలు నీలిరంగు సముద్రపు నీటిలో ప్రతిఫలిస్తున్నాయి.

చీకటిరాత్రి – ప్రచండమైన గాలి.

సముద్రం అల్లకల్లోలంగా వుంది.

అలల తాకిడికి పడవ అటూ, యిటూ వూగుతోంది. ఆ యువతి తనలోతాను కాసేపు ఆలోచించుకొంది. సైనికు లందరూ నిషాలో వున్నారు. అందులో ఒక సైనికుడి పటకాకు వ్రేలాడే కత్తిని అతి జాగ్రత్తగా తీసుకొని మెల్లమెల్లగా ఖైదీ దగ్గరకు వచ్చింది. ఇంతలో "తుఫాన్" అంటూ బిగ్గరగా అరిచాడు పడవ కెప్టెన్.

ప్రమాద సూచకంగా గంటలు మ్రోగాయి. అందరూ తమ తమ జాగ్రత్తల్లో వున్నారు. ఆ యువఖైదీమాత్రం అలాగే కూర్చున్నాడు. ఎవరో తాడు లాగుతున్నారు. ఒకరు తెరచాప విప్పుతున్నారు. ఆ యువకుడు పడవకు కట్టిన తాడు దగ్గరకు వెళ్ళాడు. ఆకాశాన్నంతా అంధకారం అలుముకుంది. తరంగాలు ఉవ్వెత్తుగా లేచి పడుతున్నాయి. సముద్రం గర్జిస్తోంది. ప్రచండమైన తుఫానులో, ఆ అలలతాకిడికి నావ బంతిలాగా ఆటూ యిటూ వూగుతోంది. ఒక్కకనురెప్ప పాటులో పడవ స్వతంత్రం అయింది. అంత క్లిష్టసమయంలోనూ ఖైదీ లిద్దరూ నిండుగా నవ్వుకున్నారు. రివ్వుమంటూ వీస్తూన్న గాలిలో వారి నవ్వు ఎవ్వరికీ వినిపించలేదు.

## 2

అనంతుడైన సాగరుడు ఉషాబాలకు స్వాగతం ఇచ్చాడు. సూర్యుని బంగారు కిరణాలు పడి కోమలములైన అలలు చిరునవ్వు నవ్వుతున్నాయి. వాతావరణం ప్రశాంతంగా వుంది.

నావికులు చూచేసరికి నావజాడలేదు. ఖైదీల చేతులకు సంకెళ్ళు లేవు. పడవ నాయకుడు యువఖైదీ బుద్ధగుప్తుణ్ణి చూచి "నిన్ను విడుదలచేసిం దెవరు?" అని ప్రశ్నించాడు.

బుద్ధగుప్తుడు ''ఇది" అన్నాడు తన దగ్గరి చురకత్తిని చూపి.

"అయితే తిరిగి నిన్ను బంధిస్తాను."

"ఎందుకు? నావ యజమాని మణిభద్రుడు లేకపోవడంతో నేనే దీనికి యజమానిని."

నాయకుడు ఉలిక్కిపడ్డాడు. "నువ్వా! నీటిదొంగ బుద్ధగుప్తుడు పడవకు నాయకుడా? ఎన్నటికీ కాలేడు." అంటూ తన కత్తికోసం వెదుకసాగాడు.

చంప అంతకుమునుపే దానిని చేజిక్కించుకొన్నది. నాయకుడు కోపంతో కంపించసాగాడు.

అప్పుడు బుద్ధగుప్తుడు "ద్వంద్వ యుద్ధానికి తయారుగావుండు. దానిలో విజయలక్ష్మిని ఎవరు వరిస్తే వారే

పడవకు యజమాని" అని కత్తిని తిరిగి నాయకునికి యివ్వవలసిందిగా చంపను ఆదేశించాడు.

భీకరమైన పోరాటం తర్వాత బుద్ధగుప్తుడు నాయకుని జయించి పడవకు యజమాని అయ్యాడు. నాయకుడు అతని అనుచరుడుగా వుంటానని ప్రమాణం చేశాడు.

చంప బుద్ధగుప్తుని దగ్గరకు చేరి తన కోమలములైన కరములచేత, స్నిగ్ధములైన చూపులచేత అతన్ని సేద తీర్చసాగింది.

కొంతసేపు విశ్రమించాక, "మనం యిప్పుడు ఎక్కడ వున్నాం?" అని అడిగాడు బుద్ధగుప్తుడు.

''బాలీ ద్వీపానికి సుదూరంగా వున్న ఓ కొత్తద్వీపం దగ్గర వున్నాం. సింహళ ద్వీపవణికులు తరుచు అక్కడ విడిది చేస్తూ వుంటారు.''

''మనం ఎన్ని రోజుల్లో అక్కడకు చేరగలం?''

''గాలి అనుకూలంగా వుంచే రెండు రోజుల్లో."

శరణాగతుడైన నాయకుడు పడవను స్వయంగా నడుపుతూ "ఇక్కడ సముద్రంలో మునిగి ఓ చిన్నగుట్ట వుంది. జాగ్రత్తగా వుండకపోతే పడవ దానికి గ్రుద్దుకునే ప్రమాదం వుంది" అన్నాడు బుద్ధగుప్తునితో.

## 3

"నిన్ను వీళ్ళు ఎందుకు ఖైదు చేశారు?"

"మణిభద్రుడి పాపపు కోర్కెవల్ల."

"మీ ఇల్లెక్కడ?"

''గంగానది ఒడ్డున వున్న చంపా నగరానికి చెందిన ఓ క్షత్రియ బాలికను నేను. నాన్నగారు ఈ మణిభద్రుని నావలో కాపలాదారుగా వుండేవారు. అమ్మపోయాక నేనుకూడా నాన్నగారితో నావమీదనే వుండేదాన్ని. ఎనిమిది సంవత్సరాలనుంచి సముద్రమే నా యిల్లు. మీరు మా పడవను ఆక్రమించుకొనేసరికి నాన్నగారు ఏడుగురు సముద్రపు దొంగలను చంపి తాను సముద్రానికి ఆహుతి అయ్యారు...ఒక మాసం గడిచింది... ఈ నీలాకాశానికీ, నీలాంబుధికీ మధ్య, ఒక భయానకమైన అనంతత్వంలో నేను ఒక నిస్సహాయురాలినిగా, అనాధగా మిగిలాను....మణిభద్రుడు ఒకనాడు నా దగ్గర అసహ్యాకరమైన ప్రస్తావన తెచ్చాడు. నేను కసితీర తిట్టాను. అందుకే నన్ను ఖైదుచేశాడు'' అన్నది చంప రోషంతో కంపించిపోతూ.

''నేను తామ్రలిప్తకు చెందిన క్షత్రియుణ్ణి, చంపా! కాని దురదృష్టవశాత్తు నీటిదొంగగా జీవితాన్ని గడపవలసి వచ్చింది... ఆఁ! ఇప్పుడు నువ్వు ఏం చెయ్యదలచుకున్నావు?''

"అనిర్దిష్టమైన నా అదృష్టం ఎటు తీసుకు వెడితే అటు వెడతాను." చంప కళ్ళు అనంతమైన యీ ప్రపంచాన్ని శూన్య దృష్టులతో పరికించ సాగాయి. వానిలో మదోన్మత్త ఛాయలు ఏ కోశానా లేవు. ఆమె తెల్లని కన్నులలో బాలుని కన్ను లలో కనుపించే అమాయకత్వం ద్యోతక మౌతున్నది. హత్యలు చెయ్యడమే పనిగా పెట్టుకొన్న ఆ దొంగకూడా ఆమె కన్నులలోనికి చూచి చలించిపోయాడు. అలా చూస్తూ వుండగా అతనిలో సంభ్రమమూ, శ్రద్ధాశక్తులూ బయలుదేరి అతని జీవితంలో యౌవనపు మొదటి పుటను తెరిచాయి.

సంజచీకటులు అలుముకున్నాయి. రాగరంజిత మైన ఆ సాయంసమయంలో చంప నల్లని కురులను వీక్షిస్తూ, తన హృదయంలోని ఉద్వేగాన్ని అణుచుకో సాగాడు నీటిదొంగ బుద్ధగుప్తుడు.

అతనికి "కోమలత్వం" అనే క్రొత్త వస్తువు దొరికింది.

ఇంతలో "ద్వీపానికి చేరుకున్నాం" అని నావికుడు కేకవేశాడు. పడవ ఒడ్డుకు చేరింది. చంప నిర్భయంగా ఒడ్డుకు దూకింది.

అందరూ దిగాక, బుద్ధగుప్తుడు అన్నాడు:

"ఇంతవరకు యీ ద్వీపానికి పేరు లేదు కదూ! మనం దీనిని చంపాద్వీప మని పిలుద్దాం"

చంప ఫక్కున నవ్వింది.

## 4

అయిదు సంవత్సరాల తరువాత —

శరత్కాలం. నీలాకాశంలో తెల్లని తారలు మినుకు మినుకు మంటున్నాయి చంద్రుడి ఉజ్జ్వల విజయకాంతికి సంతోషించి శరత్ లక్ష్మి ఆశీర్వదిస్తూ గంపల కొద్దీ పూలను చల్లిందా అన్నట్లుగా వున్నాయి నక్షత్రాలు. చంపాద్వీపంలో ఒక పెద్ద మేడ. ఆకాశదీపం వెలిగిస్తోంది చంప అతికష్టంతో అభ్రకంతో చేసిన పెట్టెలో దీపం పెట్టి తన కోమలమైన అంగుళులతో దాని త్రాడును లాగింది. ఆ దీపం పైకి పోతూవుంటే ఆమె కళ్ళు అమాయికమైన ఆనందంతో ప్రజ్వలింపసాగాయి.

నెమ్మదిగా దీపం పైకి చేదింది ఆ ఆకాశదీపం నక్షత్రసమమై పోవాలని చంప కోరిక. కాని అలా జరగడం అసంభవమని ఆమెకూ తెలుసు. అంత వరకు ఆశాభరితమైన ఆమె కన్నులు నిరాశతో క్రిందకు వాలిపోయాయి.

ఎదురుగా సముద్రం వెండిలా మెరుస్తూ చూడముచ్చటగా వుంది. చుట్టూ వున్న పర్వతపంక్తులకు తాకి, జలకన్యల కోసం ముత్యాల బుడగలను తయారు చేస్తున్నాయి తరంగాలు. అలలు తీయగా, మధురంగా నవ్వి అదృశ్యం అవుతున్నాయి. కదులుతున్న నీటిలో చంప ప్రతిబింబం అస్తవ్యస్తంగా కనిపిస్తోంది

చంప అటూ, యిటూ చూచింది. ఎవ్వరూ లేరు. "జయా" అని బిగ్గరగా పిలిచింది. ఆ పిలుపుకు ఒక నల్లని ఆటవిక యువతి ఆమె ఎదుటకువచ్చి సవినయంగా నిలిచింది. ఆమె నవ్వుతూవుంటే నీలాకాశంలోని నక్షత్రాల్లా ఆమెపళ్ళు మెరుస్తున్నాయి. చంపను "మహారాణీ''గా చూడాలని బుద్ధగుప్తుని ఆజ్ఞ.

''మహానావికులు ఎప్పుడు వస్తారో తెలుసుకురా" ఆజ్ఞాపించింది చంప. జయ వెళ్ళిపోయింది. దూరంనుంచి పవనుడు చంప మేలిముసుగుతో సయ్యాటలాడుతున్నాడు. ఆమె హృదయం కల్లోలంగావుంది. ఎందుకో ఆమె మనస్సు బావుండలేదు.

ఇంతలో ఒక దృఢకాయుడు ఆమెను సమీపించాడు.

"బుద్ధగుప్తా!" అన్నది చంప, ఆశ్చర్యంతో.

"ఏమిటీ యీపిచ్చి చంపా! ఇంతవరకు ఇక్కడే దీపంవెలిగిస్తూ కూర్చున్నావా?.....ఈ పని కూడా నువ్వే చెయ్యాలా?"

''క్షీరసాగర శయనుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికి వెలిగిస్తున్న యీ దీపాన్ని దాసీలచేత వెలిగింపించమంటారా?"

"నవ్వొస్తోంది...ఈ ఆకాశ దీపాన్ని ఎవరికి త్రోవచూపాలని వెలిగించావు, చంపా? నీవు ఆరాధించే భగవంతుడికి కాదుగదా?"

"కావచ్చు...ఆయనకు కూడా అప్పుడప్పుడు మరుపు సహజం...లేకపోతే బుద్ధగుప్తుడికి ఇంత ఐశ్వర్యం ఎందుకిస్తాడు?"

"ఈ ద్వీపంలోని ఐశ్వర్యమంతా చంపాదేవిదేగా!"

"వద్దు బుద్ధగుప్తా! నన్ను ఈ కారాగారంనుంచి విడుదలచెయ్యి. ఇప్పుడు బాలీ, జావా, సుమత్రాలవంటి అన్ని ద్వీపాల వ్యాపారమూ నీ చేతుల్లోవుంది. ...కాని నీకు ఒకే ఒక్కనావ ఉన్నప్పుడు, చంపాతీరాన వ్యాపారం చేస్తూ సుఖంగా జీవితం గడిపినరోజులు నాకు జ్ఞాపకం వస్తున్నాయి....ప్రభాత సమయంలో, తారల జాజ్వల్యమాన మైన వెలుగులో మన నావ యీ సముద్రంలోనే ఎన్నిసార్లు విహరించేది? బుద్ధగుప్తా! ఈ అనంతమైన ఏకాంతంలో, ప్రకృతి అంతా నిద్రిస్తున్న సమయంలో, నక్షత్రాలకాంతి క్రమంగా తగ్గిపోతూ వుండగా — మనం యిద్దరం శ్రమించి, అలసిపోయి, ఒకరి కొకరం దగ్గరగా, ఒకరి కళ్ళల్లోకి మరొకరం వీక్షిస్తూ అలాగే వుండి పోయేవాళ్ళం....ఆ నక్షత్రాల మధురఛాయల్లో..."

"ఇప్పుడు అంతకంటె ఆనందంగా విహరిద్దాం, చంపా! నువ్వు నా ప్రాణదాతవు. నా సర్వస్వం నీవే!"

"వద్దు...నువ్వు దొంగతనం అయితే వదిలిపెట్టావు. కాని నీ హృదయం మాత్రం ఎప్పటిలానే దయారహితంగాను, ఆశాభరితంగాను వున్నది.... భగవంతునిపేరు చెబితే నవ్వుతావు. నేను ఆకాశదీపం వెలిగిస్తే నీకు హేళన.. బుద్ధగుప్తా! భయంకరమైన అంధకారంలో వున్నప్పుడు ఒక్క వెలుగు కోసం మనం ఎంత పరితపిస్తాం?...నా చిన్నతనంలో—మా నాన్న గంగానదిలో నావమీద ఉద్యోగానికి వెళ్ళినప్పుడల్లా మా అమ్మ మట్టిప్రమిదలో దీపం వెలిగించి, గంగానదీ తీరాన ఎత్తుగా వ్రేలాడగట్టి—"భగవాన్! అంధకారంలో దారి తెలియని నా భర్తను సరైనమార్గంగుండా నడిపించు" అని ప్రార్థించేది. కొన్ని సంవత్సరాల తరువాత మా నాన్నగారు తిరిగివచ్చి. "సాధ్వీ! నీ ప్రార్థనలవలన భయంకరమైన కష్టాలనుంచి భగవంతుడు నన్ను కాపాడాడు" అనేవారు. ఆమె కంఠంగద్గదమయ్యేది...నాతల్లి!..ఓహ్! బుద్ధిగుప్తా! ఈ ఆకాశదీపం ఆమె దివ్య స్మృతే!!...నా తండ్రి!!...వీరుడయిన నా తండ్రి మరణానికి కారణం నువ్వే!!... అవును, నువ్వే;!! నీటి దొంగవు! నా ఎదుట నిలువకు....వెళ్ళు..." అంటూ అరిచింది చంప. ఆమె ముఖం కోపంతో అరుణారుణం అయింది...

ఆ నావికుడు ఆమెవంక చూడడమే లేదు. చూడకనే పగలబడి నవ్వాడు. "అదేమిటి చంపా! నీకు ఒంట్లో బావుండలేదా యేం? పోయి పడుకో —" అంటూ వెళ్ళిపోయాడు.

చంప చేతులు బిగించి, అటూ యిటూ పిచ్చిదానిలా తిరుగసాగింది.

## 5

సాయం సమయం. నిర్జనంగావున్న సముద్ర ప్రాంతం. ఒడ్డుకు కొట్టుకొని అలలు అటూ, యిటూ చిమ్మబడుతున్నాయి. పశ్చిమాద్రికి పయనిస్తున్న పథికుడు అలసిపోయాడు. ఆయనముఖం అరుణవర్ణం దాల్చింది. అతని శాంత గంభీర స్వరూపం కోలాహలభరితమైన సాగరాన్ని కూడా ఆలోచనా మగ్నం చేసింది.


చంప, జయ మెల్ల మెల్లగా ఒడ్డుకు వచ్చి నిలిచారు. సముద్రపుగాలి వారి వస్త్రాలను చెదిరివేస్తున్నది. జయ ఒక నావను పిలిచింది. ఇద్దరూ నావ ఎక్కగానే నావికుడు దిగిపోయాడు. జయ నావను నడపసాగింది.

ఉదాసీనంగా ఉన్న ఆ వాతావరణం చంపను ముగ్ధురాలిని చేసింది. ఆమె తానుకూడా ఆ ప్రకృతిలో లీనమైపోవాలని ఆకాంక్షించింది.

ఎంతనీరు! ఎంతటి చల్లదనం!!

అయినా హృదయావేదన చల్లారడం లేదు.

చల్లార్చుకోవాలని చేసే ప్రయత్నమూ నెగ్గడంలేదు.




"తీరాన్ని కొట్టుకొని విలపించే తరంగాల్లా నేనుకూడా రోదించనా ?''

"లేక పశ్చిమాద్రిలో మునిగిపోతున్న సూర్య స్వర్ణగోళంలా నేనుకూడా ఈ సముద్రంలో విలీనం అయిపోనా ?"

చంప చూస్తూ వుండగానే జ్వలిస్తున్న ఎఱ్ఱనిబింబం క్రమక్రమంగా సముద్రంలో లీనమైపోయింది. చంప పెద్ద నిట్టూర్పు విడిచి ముఖం క్రిందకు దింపుకొంది. తిరిగి చూడగానే మహానావికుని నావ వారిదగ్గరకు వచ్చింది. బుద్ధగుప్తుడు చేయిచాపాడు. అది అందిపుచ్చుకొని చంప అతని నావలోనికి పోయి కూర్చుంది.

"ఇంత చిన్న నౌక మీద యిలా తిరగడం మంచిదికాదు. ఇక్కడే నీటిలో చిన్నగుట్టవుంది. దానికి నావ కొట్టుకుంటే ఏమయ్యేది ?"

"చాలా బావుండేది. ఇక్కడ నాలుగు గోడలమధ్య బందీగా వుండేకంటే ఈ సముద్రానికి శాశ్వతంగా బందీని అయితే ఎంత బావుండును !''

"ఎంత కఠినురాలివి చంపా ! నీ కోసం క్రొత్త ద్వీపాన్ని, క్రొత్త రాజ్యాన్ని, క్రొత్త ప్రజను కూర్చగలిగిన బుద్ధగుప్తుడు నువ్వు ఆజ్ఞాపిస్తే ఏం చెయ్యడు ?.....చెప్పు, చంపా ! ఈ కత్తితో నా హృదయాన్ని చీల్చి, యీ చేతులతోనే ఈ సముద్రంలోనికి విసిరి వేయమంటావా ?''

మహానావికు డన్న పేరుతో — బాలీ, జావా, సుమత్ర — ద్వీపా లన్నీ — ప్రతిధ్వనిస్తున్నాయి. గాలి కంపిస్తోంది. కాని అతడే యీ చంపముందు గుటకలు మ్రింగుతూ, సజలనేత్రుడై కూర్చొని వున్నాడు !

ఎదురుగా పర్వత సంక్తులమీద, పచ్చని బయళ్ళలో, అనంతమైన జలనిధిలో, నీలాకాశంలో — అంతటా మేలిమిబంగరు సంజెవేళ, ఆహ్లాదకరమైన పరిసరాలు, ప్రకృతి సహృదయ కల్పన — విశ్రమించడానికి శీతల చ్ఛాయలు స్వప్నలోకాన్ని జ్ఞప్తికి తెస్తున్నాయి. ఆకాశమంతా మధువులా మత్తెక్కి వుంది. సృష్టి అంతా నీల కమలాలతో నిండివుంది. ఆ సౌరభానికి మత్తెక్కిన చంప బుద్ధగుప్తుని రెండు చేతులూ తన చేతులలోనికి తీసుకుంది. ఉవ్వెత్తుగా లేచిన రెండు అలలు ఏకమైనట్లు వారిద్దరూ ఒకరినొకరు కౌగలించుకొన్నారు. కాని వెంటనే చంప తేరుకొని తన చోళీనుంచి ఒక కత్తిని వెలికి తీసింది.

''బుద్ధగుప్తా! ఇంతవరకు నా కోపానికి ప్రతిరూపంగా దాచివుంచిన యీ కత్తిని ఈ సముద్రములోనికి విసిరి వేస్తున్నాను....నా హృదయమే నన్ను మోసం చేసింది.''

మెరుపు మెరిసినట్లు ఆ కత్తి సముద్రంలోనికి దూసుకుపోయింది.

"నేను క్షమింపబడ్డానా, చంపా! ఇక నిన్ను విశ్వసించవచ్చునా?" — ఆశ్చర్యంతోను, ఆనందంతోను మహానావికుని స్వరం కంపించింది

"విశ్వాసమా? వద్దు బుద్ధగుప్తా! నేనే నా హృదయాన్ని విశ్వసించలేకుండా వున్నాను. నిన్నెలా విశ్వసించమని చెప్పేది? అదే నన్ను మోసగించింది....నీవంటే నాకు పరమ అసహ్యం.....అయినా నిన్ను నేను ప్రేమిస్తూ వున్నాను...నీ కోసం చచ్చిపోతాను...ఏమిటో, నాకంతా అయోమయంగావుంది" అంటూ చంప ఏడ్చింది.

మహానావికుడు దీర్ఘంగా నిట్టూర్చి, అన్నాడు: ''నా జీవితంలో పుణ్యతమమైన ఈ ఘడియకు గుర్తుగా ఒక దీప స్తంభం నిర్మిస్తాను చంపా! — ఇక్కడే; ఆ పర్వత శిఖరాగ్రంమీద — అంధకారమయమైన నా జీవిత సంధ్యకు అదైనా వెలుగును ప్రసాదిస్తుందేమో?''

## 6

చంపాద్వీపానికి ఆవలివైపు మనోహరమైన ఓ పర్వతపంక్తి వుంది. చాలాభాగం అది సముద్రంలోనికి చొచ్చుకొని వుంది. ఎత్తైన సముద్రపు అలలు ఉప్పొంగుతూ దాన్ని కప్పివేస్తున్నాయి. నేడు ఆ పర్వతాగ్రంమీదనే చంపాద్వీపపు ఆదిమవాసుల సమావేశం. వారంతా చంపను వనదేవతలా అలంకరించారు. తామ్రలిప్తనుంచి వచ్చిన సైనికులు, నావికులు బారులుతీర్చి నిలబడ్డారు. వారికి మధ్యగా వనపుష్పభూషిత అయిన చంప డోలీలో తీసుకొనిపోబడుతోంది.

ఆ పర్వతపంక్తిలో ఎత్తైన శిఖరం మీద చంపాద్వీపపు నావికులకు దారి చూప

డానికిగాను ఓ పెద్ద దీప స్తంభం నిర్మింప బడ్డది. ఆనాడే దానికి ప్రారంభోత్సవం.

బుద్ధగుప్తుడు దీప స్తంభపు ద్వారం దగ్గర నిలబడ్డాడు. డోలీనుంచి చేయి అందించి చంపను దింపాడు. ఇద్దరూ లోనికి అడుగు పెడుతూవుండగా మంగళ వాద్యాలు మ్రోగాయి. బారులుదీర్చి వన బాలికలు పూలుచల్లుతూ నాట్యం చేయ సాగారు.

దీప స్తంభపు కిటికీనుంచి బయటకు చూస్తూ, "ఇంత మంది అమ్మాయిలను ఎక్కడనుంచి పోగుచేసుకు వచ్చారు ?" అని చంప అడిగింది జయను.

''ఈ రోజు రాణీగారివివాహంకదా!'' అంటూ జయ నవ్వింది.

బుద్ధగుప్తుడు అనంతమైన సాగరాన్ని అవలోకిస్తున్నాడు. చంప ఉలిక్కిపడ్డది.

''నిజమేనా ?''

''నీవు ఇష్టపడితే అలానే జరుగు తుంది చంపా. ఈ జ్వాల ఎన్నాళ్ళ నుంచో నాలో రగులుతున్నా, దానిని నాలోనే అణుచుకున్నాను.''

''చాలు. మహానావికా ! ఆపు. నన్ను నిస్సహాయురాలినిగా, బిచ్చగత్తెగా భావించి నువ్వు ప్రతికారం చేయదలచు కున్నావా ?''

"చంపా ! ఎందు కాద్వేషం ? నీ తండ్రిని చంపింది నేనుకాదు. మరో దొంగ."

''నేను అలా విశ్వసించగలిగిననాడు, అది స్మరణీయమైన దినం అవుతుంది... కాని ఎంత విశ్వాసనీయంగా చెబు తున్నావు !"

జయ క్రిందకు వెళ్ళిపోయింది.

దీప స్తంభపు గదిలో వారిద్దరూ ఎదు రెదురుగా కూర్చున్నారు.

బుద్ధగుప్తుడు చంప పాదాలు పట్టు కున్నాడు.

"చంపా ! జన్మభూమి భారతదేశం నుంచి యింతదూరాన వుంటూ కూడా శచీంద్రులవలె మనం పూజింప బడు తున్నాం కాని ఏ అభిశాపమో మనల నిద్దర్నీ దూరంగా వుంచుతోంది...చంపా! నా జన్మభూమిని ప్రతిదినం స్మరించు కుంటూనే వుంటాను. అది మహిమా న్వితమైన దేశం; దార్శనికుల పుణ్యభూమి అది. ఐనా దానిని విడిచి ఇన్నాళ్లు యిక్కడ ఎందుకున్నానో నీకు తెలియదు ... ఇంత గొప్పవాణ్ణిగా చలామణీ అవు తున్నా, నేను బిచ్చగాణ్ణే ? ... పాషాణం వంటి నా హృదయం ఒకనాడు నీ స్పర్శతో చంద్రకాంత మణిలా కరగి పోయింది......

చంపా ! దేవుడంటేను, పాపమంటేను నాకు నమ్మకం లేదు. దయ అంటే ఏమిటో నాకు తెలీదు. పరలోకమున్న దంటే నమ్మను...కాని నా దుర్బల హృదయంమీద మాత్రం నాకు నమ్మకం వుంది. శూన్యమైన నా హృదయంలో మెరుస్తున్న తారలా ఎలా ఉదయించావో

నీకు తెలియదు. పుజబలం, ధనమదం నిండివున్న నా హృదయం ఈ నా డు శాంతిని, కాంతను కోరుతోందంటే నాకే నవ్వు వస్తోంది...నావమీదికి తిరిగి వెళ్ళి పోదామా ? అసంఖ్యాకమైన ధనరాసులను సంపాదించాను. ఇక భారత దేశానికి తరలిపోయి మనం ఇరువురంకలసి హాయిగా వుందామా ? ఇవాళ మన వివాహం జరిగితే రేపే మనం భారత దేశానికి వెళ్ళిపోదాం...మహానావికుడు బుద్ధగుప్తుని ఆజ్ఞను సాగర తరంగాలు శిరసావహిస్తాయి ఇవి స్వయంగా మన నావను దక్షిణ పవనాలతో సమానంగా భారతదేశానికి చేరుస్తాయి. పద, చంపా!

చంప అతని చేయిపుచ్చుకొంది. ఏదో ఒక ఆకర్షణశక్తి ఒక్క క్షణం సేపు యిరువురి అధరాలను కలిపింది. క్షణంలో తేరుకుంది చంప.

"బుద్ధగుప్తా ! నాకు ఏ దేశమైనా ఒకటే! నీరు, గాలి అంతటా వుండేవే! నా హృదయంలో అగ్నికివలె ఏ ఆకాంక్ష ప్రజ్వలించడంలేదు... అంతా ఒకటే — శూన్యం ... ప్రియనావికుడా ! నువ్వు స్వదేశానికి తిరిగివెళ్ళు. ఇక్కడి అమాయకులైన ప్రాణుల సుఖదుఃఖాలలో పాలుపంచుకొని, వారికి సేవ చేయడానికి నన్ను వదలి, నువ్వు వెళ్ళిపో — నీ మాతృదేశానికి."

"అయితే తప్పకుండా వెడతాను చంపా ! ఇక్కడే వుండి నా హృదయాన్ని నా ఆధీనంలో వుంచుకుంటానంటే సందేహాస్పదమైన విషయమే !.. అబ్బా ! ఈ తరంగాలు నన్ను తమలో చేర్చుకుంటే ఎంత బావుండును !" అన్నాడు నావికుడు, నిట్టూరుస్తూ. తిరిగి అడిగాడు ఆమెను:

"నువ్వు ఇక్కడ ఒక్కదానివీ ఏం చేస్తావు చంపా ?"

"మొదట్లో అప్పుడప్పుడు — ఓ ఆకాశదీపం వెలిగించి ఈ సాగరంలో నాన్నగారి సమాధిని వెతుకుదామని కలలు కనేదాన్ని...కాని నేనుకూడా ఆ ఆకాశదీపంలా వెలుగుతూ వుండిపోవలసి వస్తుందని ఇప్పు డనుకుంటున్నాను "

## 7

ఒకనాటిప్రభాతవేళ చంప దీపస్తంభం మీదినుంచి చూస్తూవుంది. దూరంగా సముద్రంలో కొన్నినావలు చంపాద్వీపం వదిలి పశ్చిమోత్తరాలవైపు పరుగులెడుతున్నాయి. ఆమె కన్నులనుంచి బాష్పధారలు ప్రవహిస్తున్నాయి.

ఇది ఎన్నో శతాబ్దాల నాటి మాట చంప జీవితాంతంవరకు దీపస్తంభంలో దీపాన్ని వెలిగిస్తూ, చూస్తూ కూర్చొని వుండేది...ఆమె తరువాతకూడా ఆ ద్వీపవాసులు మమతా, స్నేహం, దయా గుణాలకు ఆలవాలమైన ఆమె సమాధిని చాలరోజులు పూజిస్తూవుండేవారు.

కాలపు కఠోరహస్తాలు ఆ సమాధినీ తమ చంచలత్వంతో చెరిపివేశాయి ★